అనుకొన్నంతకాలం దుఃఖం తప్పదు, ఎవరికి జీవలక్షణాలు నశించవు. మీకు మనస్సులో ఎంత అశాంతి ఉన్నా, దేహంలో ఎన్ని రోగాలు ఉన్నా మీరు ఆత్మస్వరూపులే. మీరు ఎంత మహాపండితులైనా గురువు దయ లేకుండా మనస్సు లోపలకు వెళ్ళదు. డబ్బు, కీర్తి, పాండిత్యాలు, అధికారాలు ఒక కాలంలో వస్తాయి, ఇంకో కాలంలో పోతాయి. కాలప్రవాహంలో కొట్టుకొని పోకుండా ఉన్నది నీ స్వరూపం మాత్రమే. స్వరూపం అరూపము. మన మనస్సు రూపాన్ని పట్టుకొంటుంది కాని అరూపాన్ని పట్టుకోలేదు. మనం ఏదైనా పనిచేసేటప్పుడు పని జరుగుతూ ఉంగాలి లోపల మనిషి కనబడకూడదు, అది నేర్చుకోండి. నేను మాట మాట్లాడుతూ ఉంటే అక్కడ నాన్నగారు కనబడకూడదు. నాన్నగారు అదృశ్యమైతేనేగాని స్వరూపం తెలియబడదు. రూపం వచ్చాక ఏదో పేరు పెడతారు. ఆ రూపంతోను, పేరుతోను తాదాత్మ్యం ఉన్నంతకాలం మీరు కోటి గ్రంధాలు చదివినా ఎక్కడ ఉన్నవారు అక్కడే ఉంటారు కాని ఒక్క అంగుళం కూడా లోపలకు దిగలేరు. నా మాయను జయించడం సాధ్యం కాదు అని పరమాత్మ చెప్పాడు. ఒకవేళ మనం ప్రయత్నం చేసినా ఈశ్వరానుగ్రహం లేకుండా అది సాధ్యం కాదు. కనిపిస్తున్న మనుషులమీద మనకు ప్రేమ లేనప్పుడు ఎక్కడో ఉన్న దేవుడిని ప్రేమిస్తున్నాను అంటే అది అసత్యం. మనలను మోసం చేసినా ఇబ్బంది లేదు కాని వారిని వారు మోసం చేసుకొంటున్నారు.

సూర్యుడు ప్రకాశిస్తూ ఉంటాడు, ఆ ప్రకాశం తెచ్చిపెట్టుకొన్నది కాదు, అది సహజం. చంద్రుడికి చల్లదనం సహజం. అలాగే కొంతమందికి మంచితనం సహజంగా ఉంటుంది. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా చాలా కష్టాలలో ఉన్నప్పటికి ఆ మంచితనం అలాగే ఉంటుంది, అది వారికి సహజం. జీవ లక్షణాలు ఉన్నంత సేపు సంసారం తప్పదు. ఉన్నది ఒక్కటే అది కొంతమందికి మనస్సుగా కనిపిస్తోంది. కొంత మందికి దేహంగా కనిపిస్తోంది, దేహమే సత్యం, దేహం పుట్టినప్పుడు నేను పుట్టాను అనుకొనేవారు దేహమే ఆత్మ అనుకొంటున్నారు. ఈ దేహాత్మబుద్ధి నశించేవరకూ వాడు కోటి జన్మలు ఎత్తినా బ్రహ్మమే తాను అనే బుద్ధి వాడికి కలుగదు. సబ్జక్టు అవగాహన కానప్పుడు బండ పనులలోనికి వెళ్ళిపోతాము. మనం ఆరోగ్యాన్ని కాపాడుకోలేకపోతే అనారోగ్యం వచ్చేస్తుంది. రోడ్డుమీద ఉన్న తుక్కు అంతా నోల్లుకొంటూ ఉంటే మనస్సుకు అశాంతి వచ్చేస్తుంది. చనిపోవటం,

పుట్టటం ఇవి శరీరానికి ఎంత సహజమో దుఃఖం రావటం మనస్సుకు అంత సహజం. అయితే ఇవి రెండూ స్వరూపంలో లేవు. మీరు ధనవంతులు అనుకొన్నా, పేదవారు అనుకొన్నా మనస్సుకే. పేదవారి హృదయంలో ఏదైతే ఉందో ధనవంతులు హృదయంలో కూడా అదే ఉంది. ఇవన్నీ పైపై మెరుగులు, వీటిని చూసి మోసపోకూడదు. భగవంతుడు ఒకోసారి మీకు అంతులేని ధనాన్ని ఇస్తాడు. ధనం వచ్చినప్పుడు మీకు ఏమైనా గర్వం వస్తుందా, మీరు ఎలా ఉన్నారు అని భగవంతుడు చూస్తాడు. జ్ఞానం గురించి చెపితే డబ్బురాదు, యజ్ఞం చేయండి మీ కోరిక నెరవేరుతుంది అంటే లక్షల రూపాయలు ఇచ్చేస్తారు. జ్ఞానం యొక్క విలువ మీకు తెలియటం లేదు. కోరికలు కావలసినవారు ఆ కోరికలను నెరవేర్చే దేవతలను పూజించుకొంటారు, వారి కోరికలు నెరవేరవచ్చు, నెరవేరకపోవచ్చు. కాని నన్ను కోరుకొన్నవాడు, నన్ను ప్రేమించేవాడు, నాకోసం జీవించేవాడు, తన మనస్సును నాకు అర్పించినవాడు నన్ను పొందుతాడు అని పరమాత్మ చెప్పాడు. అగ్నికి వేడి ఎంత సహజమో లోపల ఉన్న చైతన్యానికి శాంతి, ఆనందం అంత సహజం. ఆ వస్తువుకు చావు, పుట్టుక ఎలా ఉంటుందో తెలియదు. మనస్సును ఏకాగ్రం చేసినవాడికి, మనస్సును పవిత్రం చేసుకొన్నవాడికి మాత్రమే ఆ వస్తువు దొరుకుతుంది కాని మిగతా వారికి దొరకదు అని పరమాత్మ చెపుతున్నాడు.

ఒక తల్లికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి రోడ్డుమీద నడిచి వెళుతోంది. చిన్నపిల్లవాడు చంకలో ఉన్నాడు, పెద్దవాడు తల్లి చెయ్యి పట్టుకొని నడుస్తున్నాడు. కుక్క ఒకటి మొరుగుతూ వచ్చింది. చెయ్యి పట్టుకొన్న వాడు కంగారుపడి తల్లి చెయ్యి వదిలేసాడు, కిందపడిపోయాడు, దెబ్బలు తగిలాయి. చంకలో ఉన్నవాడు అలాగే ఉన్నాడు. గురువు ఎవరినైతే ఎన్నుకొన్నాడో వాడు చంకలో ఉన్న పిల్లవాడి లాంటివాడు, వాడికి ఏమీ ప్రమాదం లేదు. గురువు మనలను ఎన్నుకొంటే జారిపడే అవకాశం లేదు. మనం గురువును ఎన్నుకొంటే జారిపోయే అవకాశం ఉంది, ఆ గురువును తప్పించి ఇంకొక గురువు దగ్గరకు పోయే అవకాశం ఉంది, పతనం అయ్యే అవకాశం ఉంది. ఇటువంటి కథలు రామకృష్ణుడు చెప్పేవారు. రాముడు లంకలో ప్రవేశించినా అక్కడ ఉన్న రాక్షసులను చంపితేగాని సీతమ్మ ఆయన చేతికి రాలేదు అలాగే మీ మనస్సులో ఉన్న రాగద్వేషములను, కామక్రోధములను వీటి అన్నింటిని చంపకపోతే మీ

హృదయంలో ఉన్న ఆత్మ మీ చేతికి అందదు. మీ దేహలక్షణాలను, మనస్సు లక్షణాలను తీసుకొని వెళ్ళి లోపల ఉన్న ఆత్మకు ఎంతకాలం అయితే అంటగడుతున్నారో అంతకాలం మీకు ఎంత డబ్బు ఉన్నా, చదువు ఉన్నా, కీర్తి ఉన్నా వీటి వలన ఏమీ ప్రయోజనం లేదు, ఇవి అన్నీ ఒకటి లేని సున్నలతో సమానము. ఇసుక, సిమ్మెంట్, ఇటుకలు అవి తెచ్చి గుడి కట్టేయవచ్చు, దానివలన మీకు పుణ్యం రావచ్చు, పుణ్యం వస్తే సుఖరూపంలో ఖర్చు అయిపోతుంది. అది కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. కాలంతోటి జన్మలతోటి సంబంధం లేకుండా శాశ్వతంగా ఉండే వస్తువు గురించి ఎవరైనా చెపుతూ ఉంటే మీరు ఇష్టపడటం లేదు ఎందుచేతనంటే దాని విలువ మీకు తెలియటం లేదు. రత్నాలను తీసుకొని వెళ్ళి పందులముందు వేయకండి అన్నాడు ఏసు. అవి ప్రక్కనుండి వెళ్ళవు, కాళ్ళతో తొక్కి మరీ వెళుతుంది ఎందుచేతనంటే వాటి విలువ దానికి తెలియదు. విలువ తెలియనప్పుడు మనం కూడా అంతే అని చెప్పాడు. మూర్తిరాజుగారికి ఇల్లు ఉంది, పొలం ఉంది కాని ఏదో కారణం వలన ఆయనకు దుఃఖం వస్తోంది. నేను శిలువ మోసాను అని అందరూ శిలువ మోయనక్కరలేదు. మీరు ఎవరైనా శిలువ మోయవలసి వస్తే శాంతిగా, ఇష్టంగా మొయ్యండి అని ఏసు చెప్పాడు. కొంతమందికి అన్ని రకాలుగా సుఖాలు ఉంటాయి. కొంతమందికి ఎటుచూసినా కష్టాలే. అయినప్పటికీ నేను శిలువను ఎలా మోసానో అలాగ మీరు కూడా కష్టాలను మొయ్యండి, వాటిని భరించండి అని ఏసు చెప్పాడు. కొంతమంది పేచీలు వస్తే వాటిని పెంచేస్తారు, కొంతమంది పేచీలు వస్తే వాటికి కారణం అర్థం చేసుకొని, వాటిని తగ్గించి, సమాధానపరచటానికి చూస్తారు, వారు ధన్యులు.

మీరు బయట ఎలా ఉన్నారు, ఏమి తిన్నారు, ఎంత డబ్బు ఉంది అనేది భగవంతుడు చూడడు. మీకు మోక్షం ఇచ్చేటప్పుడు మీ హృదయాన్ని చూస్తాడు. హృదయశుద్ధి గలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు. సాధన చేసి మీరు సంపాదించవలసింది ఏమీ లేదు. సాధన చేసి ఎప్పుడైతే అజ్ఞానాన్ని పోగొట్టుకొన్నామో లోపల ఉన్న జ్ఞానసూర్యుడు మనకు వ్యక్తమవుతాడు. మనకు డబ్బు ఉంది అని గర్వం వస్తే చనిపోయిన తరువాత డబ్బు ఎలాగు మన కూడా రాదు. ఆ డబ్బు వలన వచ్చే వికారాలు రాబోయే జన్మకు వచ్చేస్తాయి. మరల వాటిని తొలగించుకోవటానికి ఎన్ని జన్మలు పడతాయో చెప్పలేము. రోగం రాకుండా

ఉండాలి కాని రోగం వచ్చాక ఎంతకాలం పడుతుందో చెప్పలేము. లోపల కేన్సర్ ఉంటే మందు లోపల పడాలి కాని పైన కొబ్బరి నూనె వ్రాసుకుంటే అది తగ్గదు. అలాగే బయట చమత్కారాలవలన నీకు ఆత్మజ్ఞానం రాదు. మీరు వైరాగ్యం అవలంభించి, అభ్యాసం చేస్తూ, సాధన చేస్తూ ఆత్మ ముత్యం నీ హృదయంలో ఎంత లోతులలో ఉందో అంత లోతులలోనికి వెళితేగాని ఆత్మ ముత్యం నీకు లభ్యం కాదు. అప్పటివరకు ఈ మాయలో తిరుగుతూ ఉండవలసిందే. దేహబుద్ధిని ఎవడైతే త్యాగం చేయలేడో వాడు బయట ఎన్ని త్యాగాలు చేసినా వాడికి ఆత్మజ్ఞానం రాదు. దేహమే ఆత్మ అనుకొంటున్నావు, సత్యంకానిదానిని సత్యం అనుకొంటున్నావు. దానిని త్యాగం చేసే వరకు ఆత్మజ్ఞానం రాదు. మీరు రోజూ పాచి తీసుకోకపోతే ఆ పాచిబద్దకు నష్టం ఏమీలేదు, పాచి అంతా లోపలకు వెళ్ళిపోయి అనారోగ్యానికి కారణం అవుతుంది. అలాగే ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా ఈ దేహబుద్ధి నుండి నీవు విడుదల పొందకపోతే నీకు ఆత్మజ్ఞానం రాదు. భగవాన్ నిద్రావస్థ గురించి ఎక్కువ చెపుతారు. గాఢనిద్రలో నీవు పూజించే దేవుడు లేడు, ధనం గొడవ లేదు, నువు పురుషుడువో, స్త్రీవో నీకు తెలియదు, నీకు ఒక దేహం ఉందని, మనస్సు ఉందని కూడా నీకు తెలియదు, పుణ్యం గొడవ, పాపం గొడవ లేదు కాని నువ్వు ఉన్నావా, లేవా? నువ్వు ఉన్నావు. ఆ ఉండటమనే దానిని పట్టుకో. దేవుడు పేరు కృష్ణుడని, రాముడని స్థూలబుద్ధికి చెపుతారు. నిజంగా దేవుడు పేరు నేను ఉన్నాను. ఆ ఉండటం ఏదైతే ఉందో అదే నువ్వు అన్న సంగతి నీకు తెలియాలి. అప్పుడు నీకు దుఃఖం, అశాంతి ఆరిపోతుంది. అది చిటారుకొమ్మ, అక్కడకు మేల్కొలపటానికే ఈ టీచింగు.

భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. మీరు కాలాన్ని సద్వినియోగం చేసుకొంటే భగవంతుడిని అలంకరించినట్లే, దేహం చనిపోవటానికి మీరు సాధన చేయనక్కరలేదు. దాని కాలం వచ్చినప్పుడు అది చనిపోతుంది. నీ దేహానికి చావు రాకముందే దేహంతో తాదాత్మ్యం పొందే నేను చనిపోతే నిర్వాణ సుఖాన్ని పొందుతావు, ఆ సుఖం ఇట్టిది అని మనం చెప్పలేము. అది నీ మనస్సుకు, బుద్ధికి అందదు, నిర్వాణసుఖం పొందిన తరువాత కూడా పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి ఏవైనా భోగాలు వచ్చి వాడి మీద పడినా వాడికి ఏమీ వికారం కలుగదు. నదులు పొంగివెళ్ళి సముద్రంలో కలుస్తూ ఉన్నా, నదులు వెళ్ళకపోయినా

సముద్రం ఒకేలాగ ఉంటుంది, జీవన్ముక్తుడు కూడా సముద్రంలాగ ఉంటాడు. నదులలో నీరు ప్రవహిస్తోంది, ఆ నీరు అంతా నదులు తాగేయటం లేదు. చెట్లు ఫలాలు ఇస్తున్నాయి, చెట్లు ఆ పళ్ళు తినేయటం లేదు. అలాగే మీకు ఏమైనా తెలివితేటలు ఉంటే, సంపద ఉంటే అది అంతా మీరే తినేయకుండా సమాజానికి కొంత ఉపయోగించండి. అలా చేయటం వలన మీరు ఏ సమాజానికి అయితే ఉపయోగ పడుతున్నారో ఆ సమాజం కంటే మీకే ఎక్కువ లాభం, దాని వలన చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనే ద్వారం గుండానే మోక్షానికి వెళ్ళాలి. గీతలో పరమాత్మ చెప్పిన ఈ శ్లోకం గుర్తు పెట్టుకోండి. అన్నం వండేవాడు బ్రహ్మం, గరిటె బ్రహ్మం, వండటం బ్రహ్మం, తినేవాడు బ్రహ్మం అంతా బ్రహ్మమే అయినప్పుడు ఇంక నువ్వు ఎక్కడ ఉన్నావు, నువ్వు లేనేలేవు. ఆ బ్రహ్మబుద్ధి నీకు వచ్చేవరకు మాయలో నుండి బయటకు రాలేవు. సంతానం ఉండి వృధ పడటం కంటే అసలు సంతానం లేకపోవటమే మంచిది అన్న సంగతి కూడా మనకు తెలియటం లేదు. నీకు సంతానం ఉంటే నువ్వు ఏదైనా సంపాదిస్తే అది వారు తింటారు కాని నీకు మోక్షాన్ని ఇవ్వరు. పైగా మీరు మోక్షానికి వెళ్ళే మార్గాన్ని ఆటంకపరుస్తారు. మీ తల్లితండ్రులు పచ్చగా ఉంటే, వారికి సంపదలు ఉంటే మీకు భోగాలు సమకూరుస్తారు కాని మీకు జ్ఞానాన్ని ఇవ్వలేరు. అది గురువుకే సాధ్యం, ఈశ్వరుడికే సాధ్యం.

నాకు పునర్జన్మ ఉందా అని అడుగుతున్నారు నీకు అహంభావన ఉంటే పునర్జన్మ ఉంటుంది. దేహబుద్ధి ఉన్నవాడికి దేహం వస్తుంది. ఆత్మబుద్ధి ఉన్న వాడికి దేహం రాదు. శరీరానికి ముసలితనం వస్తే కోరికలు ఇంద్రియాలద్వారా నెరవేర్చుకోవాలన్నా ఆ ఇంద్రియాలు పని చేయవు. డబ్బాలో ఉన్న కిరసనాయిలు అంతా వంచేసినా డబ్బా కిరసనాయిలు వాసన వస్తూనే ఉంటుంది. అలాగే బాహ్యంగా ఇంద్రియాలు ఇంక భోగానికి పనికిరాకపోయినా లోపల భోగవాసన అలాగే ఉంటుంది. ఆత్మజ్ఞానం కలిగే వరకూ కోటి జన్మలు ఎత్తినా భోగవాసన నిన్ను విడిచిపెట్టదు. కొత్త శరీరం వచ్చాక భోగవాసనలు మరల మనకే ఇచ్చేస్తాడు, అవి పెద్ద పెద్ద చెట్లకింద అయిపోతాయి. మీకు శరీరం ఉంది అనుకో, ఆ శరీరం నువ్వు అని అనుకోవద్దు. మీకు కారు ఉంది అనుకోండి, ఆ కారు నేను అనుకోకండి. కారుకు పెట్రోలు ఎలా పోస్తున్నారో అలాగే మీ శరీరానికి అన్నం పెట్టండి. కారుకు టైరులు, ట్యూబులు

మారుస్తున్నారు కదా అలాగే మీ శరీరానికి బట్టలు మార్చుకోండి. కారు పోయినప్పుడు నేను పోతున్నాను అని మీకు అనిపించదు అలాగే శరీరం పోయినప్పుడు నేను పోతున్నాను అనుకోవద్దు. ఈ శరీరం ఉండగానే దానిలోనుండి విడిపోండి. శరీరం నీది కాదు అని తెలిస్తే శరీరం పోయినప్పుడు నేను పోతున్నాను అని అనుకోవు. ఈ రోజు నుండే ఆ భావనను అలవాటు చేసుకోండి, వాయిదాలు వద్దు. అప్పుడు మీరు లోపలకు ములగటానికి అవకాశం దొరుకుతుంది. ఈ జన్మ ఎంత అబద్దమో రాబోయే జన్మలు కూడా అంతే అబద్దం. ఒక గోతిలో నుండి బయటకు వచ్చి వేరొక గోతిలో పడవద్దు. నీ దేహాన్ని ప్రారబ్దానికి వదిలెయ్యి, అది కష్టాలు పడవలసి ఉంటే కష్టాలు పడుతుంది, భోగాలు అనుభవించవలసి ఉంటే భోగాలు అనుభవిస్తుంది. ఏ కారణం వలన నీ మనస్సు బయటకు వస్తోందో చూసుకొని ఆ కారణాన్ని తొలగించుకో, రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకోవద్దు. నువ్వు బాగుపడేవిధానం చూసుకో. నీకు జ్ఞానం కలిగితే నిన్ను చూసి కొంత మంది బాగుపడతారు. మీ శవాన్ని ఎవరైనా గౌరవిస్తే పొంగిపోకండి, ఎవరైనా గౌరవించకపోతే కుంగిపోవద్దు, దానిని బట్టి జీవలక్షణాలు పెరిగిపోతాయి, ప్రతీక్షణం జాగ్రత్తగా జీవించండి. అక్కడ ఏదో ఉంది, ఇక్కడ ఏదో ఉంది అని చెపుతూ మీ మనస్సును బాహ్యముఖానికి గెంటివేసి లోకం యొక్క ఆకర్షణలోనికి మళ్ళిస్తున్నాడో వాడు గురువు కాదు, వాడు రాక్షసుడు. సాధు రూపంలో అనేకమంది మీ దగ్గరకు రావచ్చు, వేషధారులను నమ్మి మోసపోవద్దు. మీరు బయట చూపు పెంచుకోవద్దు, లోపలచూపు పెంచుకోండి. మీ మొఖానికి పౌడరు వ్రాసి బొట్టు ఎలా పెట్టుకొంటున్నారో అలాగ ఈశ్వరుడికి పౌడరు వ్రాసి బొట్టు పెట్టండి. అంతేగాని మీ మొఖాలను శుభ్రంగా ఉంచుకొని ఈశ్వరుడి మొఖానికి బొగ్గు వ్రాయకండి. మీ క్షేమం మీరు ఎలా చూసుకొంటున్నారో అలాగే ఈ సృష్టి రూపంలో ఉన్న ఈశ్వరుడికి కూడా సహాయ సహకారములు అందించమని చెప్పటానికి ఇలా చెపుతున్నారు. భగవాన్ ఎప్పుడైనా మీ వంక చూస్తూ ఉంటే మీ జన్మలను చూడడు, మీ ఆస్తులను చూడడు, మీరు ఏదిగా ఉన్నారో దాని వంక చూస్తాడు. ఎందుచేతనంటే మీ దృష్టిని దానివైపుకు మళ్ళించటానికే ఆయన చూపు, బయట గొడవలు చూసే అలవాటు ఆయనకు లేదు.

నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఆ నిజం వైపుకు మీ మనస్సును మళ్ళించండి,

మీ మనస్సును అక్కడ ఏకం చెయ్యండి. ఈశ్వరుడి యొక్క దయ మన శిరస్సుమీద పడుతూ ఉంటే ఈ చెయ్యి ఆ చెయ్యిని తాకినప్పుడు ఆ స్పర్శ ఎంత స్పష్టంగా తెలుస్తుందో లోపల చైతన్యం తాలుక అనుగ్రహం అంత స్పష్టంగా తెలుస్తుంది. మీ మార్గంలో మీరు ఉండండి. ప్రయత్నం విడిచిపెట్టవద్దు, మీరు ప్రిపేర్ అవుతూ ఉండండి. మిమ్మల్ని ఎప్పుడు అనుగ్రహించాలి ఆ ముహూర్తం ఆయనకు వదిలేయండి. మిమ్మల్ని జ్ఞానంతో అలంకరిస్తాడు, ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు, వాడు ఈశ్వరుడు. పరమేశ్వరుడు అందరినీ అనుగ్రహిస్తాడు, అందరికి జ్ఞానం వస్తుంది. మీకు ఒకోసారి సంపదలు ఇస్తాడు, ఒకోసారి ఉన్న దానిని లాగేస్తాడు. వాడు ఏదైనా ఇచ్చినా, లాగేసుకున్నా కూడా అవి అన్నీ మిమ్మల్ని సత్యం దగ్గరకు కళ్ళు తెరిపించే పనులేకాని ఆయనకు మీమీద ద్వేషం కాదు. ఏది చేసినా అన్నీ మనమంచికే చేస్తున్నాడు. ఆయన మనకంటే వివేకవంతుడు, మనకంటే తెలివిగలవాడు, మనకంటే శక్తిమంతుడు. మీరు ధర్మంచేస్తే పుణ్యరూపంలో వస్తుంది, అధర్మం చేస్తే పాపరూపంలో వస్తుంది. వాటిని అనుసంధానం చేసేవాడే ఈశ్వరుడు. ఈ పుణ్య పాపములు అనే గొడవలు దాటి వెళ్ళండి అంటున్నారు భగవాన్, ఈ ద్వైతబుద్ధిలో ఉన్నంతకాలం జన్మలు తప్పవు. మీకు మంచి వచ్చినా, చెడ్డ వచ్చినా, సంపద వచ్చినా, దారిద్ర్యం వచ్చినా ఇవన్నీ అహంకారానికే. నీకు ఇప్పుడు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో ఆ నేను ఉన్నంతకాలం అన్నీ ఉంటాయి, ఆ నేను పోతే ఏదీ లేదు. మీరు నిజంగా ఎక్కడ ఉన్నారు అంటే మీరు దేహం అనుకొన్నా, మీరు మనస్సు అనుకొన్నా, మీరు మంచివారు అనుకొన్నా, చెడ్డవారు అనుకొన్నా మీరు ఇష్టం వచ్చినట్లు వంద విషయాలు అనుకోండి కాని భగవంతుడు చెప్పిన మాట ఏమిటి అంటే ఈ నేను అనే తలంపు ఎక్కడైతే లేదో అక్కడ మీరు ఉన్నారు. అక్కడకు చేరుకోండి, అక్కడ గురిపెట్టండి. మీరు ఈ లోకంలోనికి ఏ పని నిమిత్తం వచ్చారో మీకు కష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా ఆ పని మర్చిపోకండి. మీరు ఇక్కడకు ప్రవచనం వినటానికి వచ్చారు. ప్రవచనం వినటం మానేసి చుట్టాల ఇంటికి వెళ్ళి అక్కడ ఫలావు తినేసి తిరిగి ఇంటికి వెళ్ళిపోతే ఎలా ఉంటుందో మీరు ఈ లోకంలోనికి వచ్చిన పని మర్చిపోయి దారి తప్పిపోవటం అలా ఉంటుంది. అందువలన అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు. ప్రతీక్షణం జాగ్రత్తగా జీవించాలి.

# మనిషిని మసిచేసేది - కోరిక కోపము

తానుకాని శరీర మనోబుద్ధులను తాను అనుకొని తనకు భిన్నంగా లోకం ఉంది అని భ్రమపడే మనస్సు అనే రథం ఇంద్రియాలనే గుఱ్ఱాలతో లాగబడుచు మహా వేగంతో బాహ్యా వస్తుమయ ప్రపంచాన్ని గుర్తిస్తూ, యిష్టాయిష్టాలను ఏర్పరచుకొంటూ సంచరిస్తూ ఉంటుంది అహంకారం. కోరికే ఈ రథానికి సారథి. అసలు కోరికతోనే ఈ ప్రపంచమంతా నిర్మింపబడుతోంది అని గ్రహించాలి. కోరికల యొక్క బీజ రూపమే వాసనలు. కనిపించే వస్తువులను పరిశీలిస్తే పంచభూతాల పంచీకరణం వల్లనే రూపొందాయని గ్రహిస్తే మోహం ఎక్కడ? మానవ జీవితంలో ద్వంద్వాల ప్రభావానికి లోనుకాని కాలమేది? అంటే సత్యదర్శనం కానంతకాలమే కోరికే అజ్ఞానం. కోరికకు ఆకలేగాని అజీర్తి బాధలేదు. కోరిక నశిస్తే మనిషి స్వతంత్రుడు అవుతాడు. కోరిక తోబుట్టువులే కోపము. ఈ కోపతాపాదులను కాలానుగణంగా ప్రదర్శించువాడు సుఖి. అంటే బుస్ మనాలి కరవకూడదు. "తిండి, గుడ్డ, నీడ మానవ మనుగడకు అవసరాలు కోరికలకు అంతు లేదు అవి అనర్థ హేతువులు" అంటారు శ్రీనాన్నగారు. కోరికలను సృష్టించే మోహపు విలువలను జయించకపోతే అనునిత్యం శ్రమపడుతూ జీవితాన్ని దుఃఖమయం చేసుకోవలసి వస్తుంది. సాధకునకు కోరిక శత్రువులాంటిది. మనం లక్ష్యాన్ని మరపింపచేస్తుంది అని అప్రమత్తతతో వ్యవహరించాలి. ధర్మార్థ కామాల ప్రయోజనాలను, పరిమితులను గుర్తిస్తూ కోరికల నుండి బయట పడాలి. వైరాగ్యానికి మించిన సుఖం లేదు. "కోపమున ఘనత కొంచెమైపోవును, కోపమున సుగుణములు కొరతబడును, కోపమున బ్రతుకు కొంచెమైపోవును" అన్నారు వేమన. కోపం వల్లనే శారీరక మానసిక అనారోగ్యానికి కారణమని ఆధునిక వైద్య శాస్త్రం ఋజువు చేస్తున్నది. కోరికే మృత్యువు. విషయ భోగ కాంక్ష, తాగుడు, జూదము మనిషిని దుఃఖితునిగాను, యాచకునిగాను చేస్తుంది. అవమానం, అనాదరణ, శత్రుత్వములాంటివన్ని కోరిక కోపాల స్వభావ ఫలితాలే. క్రోధాగ్ని దారుణమైనది. అది తల్లితండ్రులను, బంధువులను, మిత్రులను వధింపచేస్తుంది. అది కోటి చెడులను తీసుకొని వస్తుంది. కోరికకు రాత్రి, పగలు అనేది లేదు. కలలో కూడా సుఖం ఉండదు కోరిక ఉన్న చోట నామం ఉండదు. నామం ఉన్నచోట కాముడు ఉండడు. మైత్రి, కరుణ, భోగ వస్తువుల పట్ల ఉపేక్ష భావం, కోప కారణం ఉన్నా శుద్ధంగా ఉండాలి. "దయ ఉన్నచోట ధర్మం, లోభమున్న చోట పాపం, క్షమ ఉన్నచోట భగవంతుడు ఉంటాడు" అన్నారు కబీర్. గురువు క్షమా స్వరూపుడు అక్కడ శాంతిని పొందాలి.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం